పీహెచ్‌సీల్లో సమస్యల తిష్ట

- పూర్తిస్థాయిలో అందని వైద్య సేవలు
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- అత్యవసరమైతే అవస్థలే
- పట్టించుకోని కూటమి పాలకులు
- వైఎస్సార్ సీపీ హయాంలో రోగులకు అత్యుత్తమ సేవలు



రావులపాలెం మండలం గోపాలపురం పీహెచ్‌సీ

రావులపాలెం: మండలంలోని పీహెచ్‌సీల్లో సమస్యలు తిష్ట వేశాయి. సిబ్బంది కొరత పట్టి పీడిస్తోంది. రాత్రి వేళ ఆసుపత్రికి వెళితే నిర్మానుష్యంగా పలకరించేందుకు ఒక్కరూ కూడా కనిపించని దుస్థితి. ప్రస్తుతం విధుల్లో ఉన్న సిబ్బందికి పనిని కేటాయించగా వారు పగలు మాత్రమే సేవలందించగలుగుతున్నారు. రాత్రివేళ విధులు నిర్వహించేందుకు అవసరమైన సిబ్బంది లేకపోవడంతో పూర్తి స్థాయిలో ఆరోగ్య సేవలు అందడం లేదు. పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ, వైద్యాధికారులు తమ ఆసుపత్రికి సిబ్బంది కావాలని ప్రతిపాదనలు పంపినప్పటికీ ప్రభుత్వం ఇప్పటి వరకూ స్పందించలేదు. మండలంలోని గోపాలపురం, ఊబలంక పీహెచ్‌సీలతో పాటు నియోజకవర్గంలో పలు పీహెచ్‌సీల్లో సిబ్బంది సమస్య వేధిస్తోంది. 2019 నుంచి 2024 వరకూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో ఆసుపత్రికి ఇద్దరు వైద్యులను నియమించి ఇంటింటికీ వైద్య సేవలను అందించేవారు. ప్రభుత్వం మారింది పీహెచ్‌సీల తీరు మారింది.

నియోజకవర్గంలో పీహెచ్‌సీలు ఇలా..

నియోజకవర్గంలోని రెండు సీహెచ్‌సీలు, ఎనిమిది పీహెచ్‌సీలు ఉన్నాయి. కొత్తపేట, ఆలమూరుల్లో సీహెచ్‌సీలు ఉండగా కొత్తపేట మండలంలో వానపల్లి, అవిడి, ఆలమూరు మండలంలో చొప్పెల్ల, పెదపళ్ళ, ఆత్రేయపురం మండలంలో ర్యాలీ, ఆత్రేయపురం, రావులపాలెం మండలంలో ఊబలంక, గోపాలపురం పీహెచ్‌సీలు ఉన్నాయి.

పట్టిపీడిస్తున్న సిబ్బంది సమస్య

రావులపాలెం మండలంలో గోపాలపురం పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు ఉండాల్సి ఉండగా ఒక్కరే ఇక్కడ సేవలు అందిస్తున్నారు. ఆత్రేయపురం మండలం ర్యాలీ పీహెచ్‌సీలో ఇద్దరుగాను ఒక్కరే వైద్యుడు ఉన్నారు. ఈ మండలంలో ముగ్గురు ఏఎన్ఎంలు లేరు. వసంతవాడ, నార్కెడిమిల్లి, తాడిపూడి సచివాలయ ఏఎన్ఎంలు లేరు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి పీహెచ్‌సీకి ఇద్దరు చొప్పున వైద్యులను నియమించింది. ప్రభుత్వం మారిన అనంతరం వైద్యుల కొరత తీవ్రంగా ఉంది.

గతంలో ప్రతి వ్యక్తికి ప్రత్యేక ఓపీ షీట్

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా పేదలందరికీ నాణ్యమైన వైద్యసేవలందేవి. ప్రతి పీహెచ్‌సీకి ఇద్దరు చొప్పున వైద్యులుండేవారు. క్షేత్రస్థాయిలోని వైద్య ఆరోగ్య కార్యకర్తలు వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సమస్యలను ఆరా తీసేవారు. వ్యక్తి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకునేందుకు రక్తపోటు, సుగర్, యూరిన్, హిమోగ్లోబిన్, మలేరియా, డెంగీ, కఫం పరీక్షలను చేసేవారు. వాటి వివరాలను జగనన్న ఆరోగ్య సురక్ష యాప్‌లో నమోదు చేసి తర్వాత షెడ్యూల్ ప్రకారం నిర్వహించే ప్రత్యేక వైద్య శిబిరాల్లో సేవలు పొందేందుకు టోకెన్‌లను జారీ చేసి నాణ్యమైన చికిత్స అందించేవారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో పీహెచ్‌సీలకి రాత్రివేళ అత్యవసర పరిస్థితుల్లో వెళితే కనీసం పలకరించేందుకు సిబ్బంది లేని పరిస్థితి నెలకొంది. ప్రజారోగ్యం క్షీణించడంతో సామాన్య ప్రజలు అల్లాడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పీహెచ్‌సీలలో వైద్యులు, సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు. గోపాలపురం, ర్యాలీ పీహెచ్‌సీల్లో ఒక్కరే డాక్టర్ ఉండటంతో వారాకి ఒక్కసారి ఇంటింటికీ వెళ్లి పరీక్షించే కేసులకు వైద్య సేవలు అందడం లేదు. ఉన్న ఒక్క వైద్యుడు పీహెచ్‌సీలోనే సేవలు అందిచండంతో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ఇక్కడ అటకెక్కింది. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం లేకపోవడంతో పీహెచ్‌సీలకు సరిపడా మందులు కూడా ఉండటం లేదని దీంతో కొన్ని మందులు గత ప్రభుత్వంలో ఇచ్చే విధంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో ఇవ్వడం లేదని రోగులు వాపోతున్నారు.

క్లుప్తంగా

ర్యాలి ఆలయానికి విరాళాలు


దాతలకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

కొత్తపేట: ఆత్రేయపురం మండలం ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయం అభివృద్ధికి, అన్నప్రసాద పథకానికి భక్తులు విరివిగా విరాళాలు అందజేస్తున్నారు. దానిలో భాగంగా సోమవారం అమెరికాలో స్థిరపడిన మేధా రాకేష్ రెడ్డి, దీప్తి దంపతులు ఆలయ అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం రూ.21 వేలు, కొవ్వూరుకు చెందిన చామర్తి నాగకుమార్, అనురాధ దంపతులు అన్నప్రసాద పథకానికి రూ.10,116 విరాళంగా సమర్పించారు. దాతలకు దేవస్థానం తరఫున అధికారులు, వేదపండితులతో ఆశీర్వచనం చేయించి, స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి చిత్రపటాలను అందజేశారు.

కార్యకర్తల కుటుంబానికి పరామర్శ


సతీష్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సూర్యారావు, పార్టీ నాయకులు

మలికిపురం: మండలంలోని గొల్లపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త వడ్డి సతీష్‌కుమార్ అనారోగ్యంతో మరణించడంతో అతని కుమారుడు సురేష్, కుటుంబ సభ్యులను మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు సోమవారం పరామర్శించారు. సతీష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పార్టీ అధ్యక్షులు అడబాల బ్రహ్మాజీ, గ్రామ శాఖ అధ్యక్షుడు తాడికాశి, మాజీ ఎంపీటీసీ గుండుమేను నారాయణమూర్తి, కందుల విజయ్‌కుమార్, గుండుమేను సత్తిబాబు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ


పోలేశ్వరరావు చిత్రపటానికి శ్రీనివాసరావు నివాళి

మామిడికుదురు: పితృవియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నేత, అప్పనపల్లి మాజీ సర్పంచ్ పిచ్చిక చిన్నను వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గం కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు పరామర్శించారు. పోలేశ్వరరావు చిత్రపటం వద్ద పుష్పాలు ఉంచి నివాళులర్పించారు.

మామిడికుదురు: పితృవియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నేత, అప్పనపల్లి మాజీ సర్పంచ్ పిచ్చిక చిన్నను మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి పరామర్శించారు. చిన్న తండ్రి పోలేశ్వరరావు ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో పోలేశ్వరరావు చిత్రపటం వద్ద రాజేశ్వరీదేవి పుష్పాలు ఉంచి నివాళులర్పించారు. పోలేశ్వరరావు కుటుంబ సభ్యులను ఓదార్చారు. చిన్నను పరామర్శించిన వారిలో పార్టీ నేతలు తోరం భాస్కర్, నెల్లి దుర్గాప్రసాద్, బొంతు చందు, పాలమూరి గోపాల్, నక్కా బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల పరిధిలో మంగళవారం నిర్వహించనున్న నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టే ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వైద్యాధికారులు డి.సాయికిషోర్, ఎస్.లక్ష్మీ స్నేహలత తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ మండలంలోని 18 గ్రామాల్లోని 49 ప్రభుత్వ, 13 ప్రైవేటు పాఠశాలలు, 76 అంగన్‌వాడీ కేంద్రాలు, రెండు ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల పరిధిలోని 12,466 మంది చిన్నారులు, విద్యార్థులకు ఒక్కో మాత్ర చొప్పున మధ్యాహ్న సమయంలో భోజనం అయిన తరువాత ఈ మాత్రలను మింగించనున్నట్లు వైద్యాధికారులు తెలిపారు.

దివ్యాంగులకు అండగా కూటమి

మామిడికుదురు: దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం సుమారు రూ.6.50 లక్షల విలువైన 33 ఉపకరణాలను దివ్యాంగులకు అందజేశారు. అభివృద్ధి, సంక్షేమంతో పాటు దివ్యాంగులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పెనుమాల లక్ష్మి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అడబాల శ్రీనివాసరావు, జనసేన, బీజేపీ మండల శాఖ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మృతదేహం లభ్యం

మామిడికుదురు: గ్రామానికి చెందిన అద్దాల సూర్యావతి(63) ఈ నెల 2వ తేదీన అదృశ్యమైంది. ఆమె మృతదేహం గోగన్నమఠంలో సోమవారం లభ్యమైందని నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్ తెలిపారు. సూర్యావతి కనిపించడం లేదంటూ ఆమె మనవడు చేపూరి దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

పి.గన్నవరం: ముంగండలోని మంత్రవాది ఇందిరాకుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు తెలిపారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారన్నారు. ఈ కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

13న మండల పరిషత్ అధ్యక్ష ఎన్నిక

రాజోలు: మండల పరిషత్ అధ్యక్షుడు కేతా శ్రీనివాసరావు ఇటీవల మృతి చెందడంతో ఖాళీ అయిన మండల పరిషత్ అధ్యక్ష స్థానానికి ఎన్నిక నిర్వహించేందుకు ఈ నెల 13న ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. గత నెల 16న అధ్యక్ష ఎన్నిక నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన సమావేశానికి టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన ఎంపీటీసీలంతా గైర్హాజరయ్యారు. కోరం సరిపోక రెండు పర్యాయాలు అధ్యక్ష ఎన్నిక వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 8న రాష్ట్ర ఎన్నికల కమిషన్ నుంచి అధ్యక్ష ఎన్నిక కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించాలని ఆదేశాలు రావడంతో ఈ నెల 13న సమావేశం ఏర్పాటు చేసేందుకు మండల పరిషత్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

హామీల అమలులో కూటమి విఫలం


పెనికేరులో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

ఆలమూరు: గత సార్వత్రిక ఎన్నికల్లో ఆచరణ సాధ్యం కాని హామీలను గుప్పించిన రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఆచరణలో విఫలమైందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతా మహాలక్ష్మి అన్నారు. మండలంలోని మూలస్థాన అగ్రహారం, పెనికేరు గ్రామాల్లో సోమవారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం జరిగింది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఏ విధంగా నిర్వీర్యం చేస్తుందన్న విషయాన్ని క్యూర్ కోడ్ ద్వారా వైఎస్సార్ సీపీ నేతలు గ్రామస్తులకు వివరించారు. అనంతరం మూలస్థాన అగ్రహారంలో మండల కన్వీనర్ తమ్మన ఆధ్వర్యంలో పార్టీ గ్రామ కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా తోట కొండయ్య, ఉపాధ్యక్షుడిగా కల్లి శ్రీనివాసుతో పాటు పలువురు సభ్యులుగా నియమితులయ్యారు. పార్టీ నేతలు యనమదల నాగేశ్వరరావు, నామాల శ్రీనివాసు, గుణ్ణం రాంబాబు, నాంద్ర నాగమోహన్‌రెడ్డి, కురుపూడి లోవ సత్యనారాయణ, కదలి ఉపేంద్ర, గుత్తుల శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

మిడ్డే మీల్స్ సక్రమంగా అమలు చేయాలి


సఖినేటిపల్లిలో విద్యాశాఖ నిర్వహించిన సమావేశం

మామిడికుదురు: డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని సమగ్ర శిక్ష జిల్లా సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం సూచించారు. ఆయన మామిడికుదురు జెడ్పీహెచ్ స్కూల్‌ను సోమవారం సందర్శించారు. అక్కడ అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థుల కోసం తయారు చేసిన భోజనం తిన్నారు. ఇంట్లో వండిన విధంగానే విద్యార్థులకు కూడా నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. విద్యార్థులందరికీ బుక్ లెట్స్ అందినదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. అందరికీ బుక్‌లెట్స్ అందాయని హెచ్ఎం బి.చిరంజీవి తెలిపారు. ఆయన వెంట మలికిపురం ఎంఈఓ వైవీ సత్యనారాయణ ఉన్నారు.

పరీక్షల పరిశీలన

సఖినేటిపల్లి: మండలంలో ప్రభుత్వ పాఠశాలలో సోమవారం నుంచి ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకూ నిర్వహిస్తున్న సెల్ఫ్ అసెస్మెంట్ మోడల్ పేపర్–1 పరీక్షలను జిల్లా కమిటీ టీమ్ బొరుసు సుబ్రహ్మణ్యం, వైవీ సత్యనారాయణ పరిశీలించారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన బుక్‌లెట్స్ పద్ధతిలో ఏ విధంగా విద్యార్థులు రాస్తున్నారో వారు పరిశీలించారు. అనంతరం మండల విద్యాశాఖ కార్యాలయంలో దీనిపై ఓ సమావేశం ఏర్పాటు చేశారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని వారు సూచించారు. ఎంఈఓ–1 డి.కిషోర్ కుమార్, ఎంఈవో–2 మద్దాలి వెంకటేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది రాజాబాబు, సంధ్యదేవి పాల్గొన్నారు.

వెన్నుపోటు.. వంచన కలిస్తే చంద్రబాబు


రామరాజులంకలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి సూర్యారావు


వాకలగరువులో బాబు మోసాలను వివరిస్తున్న కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు

అంబాజీపేట: వెన్నుపోటు.. వంచన కలిస్తే వాటికి నిలువెత్తు రూపం చంద్రబాబు అని జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ ఆధ్వర్యంలో వాకలగరువు, నందంపూడి, ఇరుసుమండ గ్రామాల్లో పరిశీలకులు కొర్లపాటి కోటబాబు పర్యవేక్షణలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కో ఆర్డినేటర్ మాట్లాడుతూ కేవలం అధికారం కోసం గడ్డికరిచి.. పేద మధ్య తరగతి ప్రజలను దగా చేసిన వ్యక్తి చంద్రబాబు అని ధ్వజమెత్తారు. సూపర్‌సిక్స్ అంటూ ప్రజలను నోటికొచ్చినట్లు వాగ్దానాలిచ్చి చివరకు వాటిని విస్మరించి, దుష్టపాలన చేస్తున్నారన్నారు. నలభై ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు ఒక్క సంక్షేమ పథకమైనా తాను ప్రవేశపెట్టానని చెప్పుకోగలడా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, కాంగ్రేగుల నాగబాబు, గోగి శ్రీరామమూర్తి, పెచ్చెట్టి రాంబాబు, దొమ్మేటి రాధా సూర్యనారాయణ, బొంతు భాస్కరరావు, గోసంగి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

జగన్ ఇచ్చిన పథకాలు తుంగలో తొక్కిన కూటమి

మలికిపురం: జగన్ హయాంలో పేదలకు అందించిన అనేక సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం వచ్చాక తుంగలో తొక్కిందని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. రామరాజులంకలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు రావి గోపాలకృష్ణ అధ్యక్షతన చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తు చేస్తూ ఇంటింటికీ వంచన ప్రచారం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, నియోజకవర్గ పరిశీలకుడు మట్టపర్తి నాగేంద్ర హాజరయ్యారు. తొలుత పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం చంద్రబాబు చేసిన మోసాలను వివరించి సమయం వచ్చినప్పుడు తగిన బుద్ధిచెప్పాలన్నారు. కార్యక్రమంలో మండలం పార్టీ అధ్యక్షుడు అడబాల బ్రహ్మజీ, మండపేట నియోజకవర్గ పరిశీలకుడు కటకంశెట్టి ఆదిత్య, పార్టీ సీనియర్ నాయకులు శేఖర్ కంచర్ల, రాష్ట్ర జిల్లా వివిధ విభాగాల ప్రతినిధులు తెన్నేటి కిషోర్, సహదేవ్ తాడి పాల్గొన్నారు. దిండిలో జరిగిన ఇంటింటికీ వంచన కార్యక్రమంలో అడబాల జానకీరామ్, నల్లి నాగేశ్వరరావు, బందెల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి


కొత్తపేటలో క్యూ ఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న దేవిడ్‌రాజు, గంగాధరరావు తదితరులు

కొత్తపేట: కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమాల్లో భాగంగా మండలంలో గ్రామ స్థాయి సమావేశాలు, ప్రజా చైతన్య కార్యక్రమాలు సోమవారం ప్రారంభించారు. ఉదయం కొత్తపేటలో డేవిడ్‌రాజు గృహావరణలో, మధ్యాహ్నం మందపల్లిలో కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు పర్యవేక్షణలో గ్రామ శాఖల అధ్యక్షులు సలాది బ్రహ్మాజీ, అడపా దొరబాబు అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, పరిశీలకులు అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, ఎంపీటీసీ సభ్యుడు విశ్వ వీర్రాజు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. డేవిడ్‌రాజు మాట్లాడుతూ మోసపూరిత వాగ్దానాలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చలేకపోయిందని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా తీసుకుని సంక్షేమ పథకాలు అందజేసిందన్నారు. వచ్చే ఎన్నికల నాటికి వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేయడంలో పార్టీ శ్రేణులందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి వారి సెల్‌తో క్యూర్ క్యూర్ కోడ్ ద్వారా సీఎం చంద్రబాబు మోసాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు గుత్తుల శ్రీనివాస్, సీనియర్ నాయకుడు ముసునూరి వెంకటేశ్వరరావు, మండల యువజన విభాగం అధ్యక్షుడు గొల్లపల్లి స్వరూప్, బీసీ విభాగం సభ్యులు దంగేటి సుబ్రహ్మణ్యం, బొక్కా లోకేష్, సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు కొవ్వూరి సుధాకరరెడ్డి పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోకాల పరీక్షల్లో ప్రథమ బహుమతి


విదుశేఖర భారతీ స్వామి ఆశీర్వాదం తీసుకుంటున్న విశాలాక్షి

అంబాజీపేట: శృంగేరి శారదా పీఠంలో జరిగిన భగవద్గీత శ్లోకాల పరీక్షల్లో అంబాజీపేటకు చెందిన దొండపాటి విశాలాక్షి ప్రథమ స్థానంలో నిలిచింది. ఈనెల 10న ఆల్ ఇండియా లెవెల్ కాంపిటీషన్లో భాగంగా శారదాపీఠంలో ప్రతి వారం నిర్వహించే పోటీలో విశాలాక్షితో పాటు 13 మంది ప్రథమ స్థానంలో నిలిచారు. వీరందరికీ శారదాపీఠం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విదుశేఖర భారతి స్వామి చేతుల మీదుగా రూ.21 వేల నగదు, సర్టిఫికెట్, స్వామివారి ఫొటో అందజేశారని తెలిపారు. భగవద్గీత శ్లోకాల పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విశాలాక్షిని ఆర్యవైశ్య మహిళలతో పాటు పలువురు అభినందించారు.

వ్యక్తి మృతిపై కేసు

పి.గన్నవరం: ఎల్.గన్నవరం శివారు నడిగాడిలో అనారోగ్యంతో బాధపడుతున్న ఒక వ్యక్తి ఆదివారం రాత్రి మృతి చెందిన నేపథ్యంలో గుర్తు తెలియని వ్యక్తి డయల్ 100కి చేసిన ఫోన్ కాల్‌తో పి.గన్నవరం పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. నడిగాడికి చెందిన సరెళ్ల మల్లేశ్వరరావు (43) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో నాలుగు నెలల క్రితం హార్ట్‌కు స్టంట్ కూడా వేయించుకున్నట్టు ఏఎస్సై పట్టాభిరామయ్య తెలిపారు. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో అతడు ఇంటివద్ద చాతీ నొప్పితో బాధపడుతుండగా 108 అంబులెన్స్‌కి ఫోన్ చేశారన్నారు. అంబులెన్స్ వద్దకు అతడిని కుర్చీలో తీసుకు వచ్చేసరికి మృతి చెందాడన్నారు. నాగమల్లేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడని కుటుంబ సభ్యులు చెప్పారన్నారు. ఈనేపథ్యంలో గుర్తు తెలియని వ్యక్తి డయల్ 100కి ఫోన్ చేయడంతో ఆ కాల్ ఆధారంగా సీఐ భీమరాజు ఆదేశాలతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై తెలిపారు. మృతదేహానికి రాజోలు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

వైభవంగా ముత్యాలమ్మ జాతర

అంబాజీపేట: నందంపూడి గ్రామంలో వేంచేసిన గ్రామదేవత ముత్యాలమ్మ జాతరను సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. జాతరలో ఏర్పాటు చేసిన గరగ నృత్యాలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. మంగళవారం ఆలయ ప్రాంగణం వద్ద తీర్థం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

జాతి సమైక్యతకు ప్రతిబింబం.. జాతీయ పతాకం


ఆలమూరులో 50 మీటర్ల జాతీయ జెండాతో ప్రదర్శనగా వెళుతున్న పౌరులు


కొత్తపేటలో భారీ జాతీయ జెండాతో ర్యాలీ

కొత్తపేట/అంబాజీపేట/మామిడికుదురు/సఖినేటిపల్లి/ఆలమూరు/పి.గన్నవరం/రావులపాలెం/అయినవిల్లి: దేశ సార్వభౌమత్వానికి, సమగ్రతకు, జాతీయ భావానికి మూడు రంగుల మువ్వన్నెల జాతీయ పతాకం ప్రతిబింబంగా నిలుస్తుందని ఆర్డీవో పి.శ్రీకర్, ఎంపీపీ ఎం.గంగాధరరావు అన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని సోమవారం కొత్తపేటలో ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ సెంటర్ వరకూ వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, సిబ్బంది, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలని అన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా 100 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. అంబాజీపేటలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎవీఎల్ నరసింహం అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ నుంచి సెంటర్ వరకు హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. మామిడికుదురు బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు బైరిశెట్టి దుర్గారామకృష్ణ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. దీప్తి స్కూల్ నుంచి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ జరిగింది. సఖినేటిపల్లి రేవు వద్ద నుంచి టేకిశెట్టిపాలెం ఎత్తు వంతెన వరకూ సోమవారం మండల బీజేపీ అధ్యక్షుడు పోతురాజు సురేష్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీ శ్రేణులు చేశారు. దేశభక్తిని, సార్వభౌమత్వాన్ని చాటుకుందామని ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు, తహసీల్దార్ ప్రకాశ్‌బాబు ప్రజలకు పిలుపునిచ్చారు. స్థానిక మండల ప్రజా పరిషత్ నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ సచివాలయ ఉద్యోగులందరూ 50 మీటర్ల పొడవైన జాతీయ జెండాను చేతబూని ర్యాలీ నిర్వహించారు. పి.గన్నవరం మండల పరిషత్ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు వరకూ హర్ ఘర్ తిరంగా ర్యాలీ జరిగింది. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ దేశభక్తిని చాటాలని రావులపాలెం జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. హర ఘర్ తిరంగా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. అయినవిల్లి ఎంపీడీవో కార్యాలయం నుంచి స్థానిక పోలీస్‌స్టేషన్ సెంటర్ వరకు హర్‌ఘర్ తిరంగా యాత్ర నిర్వహించారు.

విద్యా సామగ్రి పంపిణీ

అయినవిల్లి: సేవా సంస్థల ద్వారా విద్యార్థులకు విద్యావసరాలు తీర్చడం అభినందనీయమని పోతుకుర్రు సర్పంచ్ సయ్యపు సుబ్బలక్ష్మి అన్నారు. దీవెన ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం మండలం పోతుకుర్రులో ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులకు పెన్నులు, నోటు పుస్తకాలు, పెన్సిల్స్, ఎరేజర్స్ మొదలైన విద్యాసామగ్రిని అందజేశారు. వీటిని దీవెన ఫౌండేషన్ చైర్మన్ జి.శ్రీనివాస్ సాగర్, సర్పంచ్ సయ్యపరాజు సుబ్బలక్ష్మి చేతుల మీదుగా పంపిణీ చేశారు.

బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహం పాక్షికంగా ధ్వంసం

అంబాజీపేట: ఇసుకపూడి పరిధిలోని కాకరవారిపేటలో బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహం పాక్షికంగా ధ్వంసమయింది. ఈ విషయాన్ని స్థానికులు సోమవారం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీ మోహన్, సీఐ ఆర్.భీమరాజు, ఎస్ఐ కె.చిరంజీవిలు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సంఘటనపై దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకుంటామని స్థానికులకు పోలీసులు హామీ ఇచ్చారు. చర్చల అనంతరం విగ్రహానికి మరమ్మతులు చేపట్టి క్షీరాభిషేకం నిర్వహించి పూలమాలలు వేశారని స్థానికులు తెలిపారు. అయితే విషయాన్ని బయటకు వెళ్లకుండా ఇటు స్థానికులు, అటు పోలీసులు సమాచారాన్ని గోప్యంగా ఉంచారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

అయినవిల్లి: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. సోమవారం అయినవిల్లిలోని న్యూకాలనీలో రూ.7 లక్షలు పంచాయతీ నిధులతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ భూమి పూజ చేశారు. అలాగే ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు నిమ్మకాయల గణేశ్వరరావు అధ్యక్షతన ఆధునిక డిజిటల్ లైబ్రరీని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సోమవారం ప్రారంభించారు.

విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఆలమూరు: మండలంలోని సంధిపూడి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు సోమవారం వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు జరిగాయి. దేశ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గ్రామానికి చెందిన ఎస్ఏఎల్‌కే ఎడ్యుకేషనల్ సొసైటీకి చెందిన బాలమందిరం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం సంధిపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో చిత్రలేఖనం పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో సుమారు 50 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. అందులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఈనెల 15న గ్రామ పెద్దల సమక్షంలో బహుమతులను పంపిణీ చేయనున్నట్లు చైర్మన్ అంగర గోపాలకృష్ణాచార్యులు తెలిపారు. ఉపాధ్యాయులు కేఎస్ కృష్ణ, వి.మాధవి తదితరులు పాల్గొన్నారు.